క్లుప్తంగా

ఘనంగా ఏకలవ్యుడి జయంతి



పొన్నూరు: ముక్కోటి ఏకాదశి, ఏకలవ్య మహారాజు జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. దేవరకొండ గోపి ఆధ్వర్యంలో పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లోని ఏకలవ్యుడు విగ్రహానికి డీఎస్పీ దేవరకొండ ప్రసాద్ పూలమాలలు వేసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాలపర్తి శ్రీనివాసరావు, వరప్రసాద్, మేడ గోపి, పేరం శీను, పాలపర్తి శ్రీనివాసరావు, లీల శంకర్‌రావు, కమిటీ సభ్యులు దేవరకొండ చంటి, దేవరకొండ చిన్న, గోపి, పాలపర్తి హరిబాబు, దేవరకొండ దుర్గారావు పాల్గొన్నారు.

వాచ్‌మన్‌పై దాడి చేసిన ఒరిస్సా యువకుడు

చేబ్రోలు: రియల్ ఎస్టేట్ ప్రాంతంలో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న వృద్ధ దంపతులపై మద్యం మత్తులో ఉన్న ఒరిస్సా ప్రాంతానికి చెందిన యువకుడు దాడి చేసిన సంఘటనపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వడ్లమూడి అడ్డరోడ్డు ప్రాంతంలో ఉన్న రియల్ ఎస్టేట్ ప్రాంతంలో నగిడి కృష్ణ, రమాదేవి దంపతులు వాచ్‌మన్‌గా పనిచేస్తున్నారు. శనివారం రాత్రి సమయంలో ఒరిస్సా రాష్ట్రానికి చెందిన యువకుడు మద్యం మత్తులో కృష్ణతో వాగ్వాదానికి దిగి దాడి చేసి గాయపరిచాడు. ప్లాట్ యజమాని, స్థానికులు గమనించి గాయపడిన కృష్ణను స్థానిక ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. రమాదేవి ఫిర్యాదు మేరకు ఎస్ఐ డి.వెంకట కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జనరేటర్ చోరీపై కేసు నమోదు

చేబ్రోలు: షాపు ముందు ఉంచిన లైటింగ్ జనరేటర్ దొంగిలించిన సంఘటనపై ఆదివారం చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేశారు. చేబ్రోలు మండలం వేజండ్ల గ్రామానికి చెందిన పఠాన్ జాన్ సైదా ఖాన్ స్థానిక రైల్వే గేట్ సమీపంలో లైటింగ్, మైక్ సెట్లు అద్దెకు ఇస్తూ షాపు నిర్వహిస్తున్నారు. శనివారం సాయంత్రం షాపు ముందు ఉంచిన సుమారు రూ.2.50 లక్షల విలువ గల జనరేటర్ ఆదివారం ఉదయం చూసే సరికి అదృశ్యమైంది. జనరేటర్ దొంగతనంపై సైదాఖాన్ ఫిర్యాదు చేయగా ఎస్ఐ డి.వెంకట కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండో దశ భూ సమీకరణపై రైతుల్లో తీవ్ర వ్యతిరేకత

ఫణిదరం(తాడికొండ): రాజధాని అభివృద్ధి పేరుతో ప్రభుత్వం చేపడుతున్న రెండో దశ భూ సమీకరణపై రైతుల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు, ఈమని అప్పారావులు అన్నారు. ఆదివారం తాడికొండ మండలం ఫణిదరం, దామరపల్లి, గరికపాడు, బండారుపల్లి గ్రామాల్లో ప్రజా సంఘాల నాయకులతో కలిసి వారు పర్యటించారు. ఈ సందర్భంగా రైతులు, వ్యవసాయ కార్మికులతో మాట్లాడి అభిప్రాయాలు తెలుసుకున్నారు. రాజధాని నిర్మాణానికి మరో 44 వేల ఎకరాల భూ సమీకరణకు రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో సభలు నిర్వహించిందని.. దీనికి 70 శాతం మంది రైతులు భూములిచ్చేందుకు నిరాకరించారని తెలిపారు. గ్రామాల్లో చిన్న సన్నకారు రైతులు ఉన్నారని, దీనికి తోడు మరికొంత భూమి కౌలుకు తీసుకుని జీవనం సాగిస్తున్నామని, ఇప్పుడు ప్రభుత్వం ఆ భూమిని తీసుకుంటే తాము ఎలా బ్రతకాలని ప్రశ్నిస్తున్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి చింతల భాస్కరరావు, వై.కృష్ణ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కూరగాయలతో శ్రీహరికి అలంకరణ



దుగ్గిరాల: దుగ్గిరాల పసుపు యార్డు సమీపంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామివారిని తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం కూరగాయలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణాలు, ధ్వజ స్తంభాలను నిర్వాహకులు సుందరంగా అలంకరించారు. దుగ్గిరాలలోని శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ నాగేశ్వర స్వామి వారి దేవస్థానంలోని అమ్మవారు శాకంబరిగా భక్తులకు దర్శనం ఇచ్చారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

పెదవడ్లపూడి(మంగళగిరి): మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని పెదవడ్లపూడిలో సెయింట్ విన్సెంట్ డె పాల్ సొసైటీ ఆధ్వర్యంలో దత్తత కుటుంబాలకు నిత్యావసర సరకులను ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫాదర్ శౌరిబాబు, సొసైటీ ప్రెసిడెంట్ పి.యేసు ప్రసాద్, ప్రతినిధులు అనిల్, పట్టా శ్రీను, సైమన్, వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి బాబూ జగ్జీవన్ రామ్



ప్రత్తిపాడు మండల పార్టీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



జగ్జీవన్ రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రత్తిపాడు: దార్శనికుడు బాబూ జగ్జీవన్ రామ్ అని వైఎస్సార్‌సీపీ మండల పార్టీ కన్వీనర్ చల్లా హనుమంత్ యాదవ్ అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో ఆదివారం బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక పాతమల్లాయపాలెం కూడలిలోని మండల పార్టీ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పార్టీ నేతలు, దళిత నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హనుమంత్‌యాదవ్ మాట్లాడుతూ.. భారతదేశ ఉప ప్రధానిగా దేశానికి విశేష సేవలు అందించిన మహోన్నత వ్యక్తి బాబూ జగ్జీవన్ రామ్ అని కొనియాడారు. కార్యక్రమంలో మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు బాపతు వెంకటరమణ, గ్రీవెన్స్ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు గుజ్జుల శివారెడ్డి, పార్టీ నాయకులు వేలూరి లక్ష్మారెడ్డి, వాడపల్లి ఫ్రాన్సిస్, గండు నాగరాజు, బాపతు గోవింద్‌రెడ్డి, తమ్మా కోటిరెడ్డి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పొన్నూరు: మహనీయులు బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పట్టణ ఐలాండ్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చింతలపూడి మురళీకృష్ణ, పలువురు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షులు సోపాటి శ్రీధర్, క్రిస్టియన్ మైనారిటీ అనుబంధ విభాగం అధ్యక్షులు దండమూడి కపానందం, నాయకులు గేరా సుబ్బయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంఘ సంస్కర్త బాబూ జగ్జీవన్ రామ్..

ప్రత్తిపాడు: సంఘ సంస్కర్త బాబూ జగ్జీవన్ రామ్ అని పార్టీ నాయకులు కొనియాడారు. గుంటూరు రూరల్ మండలం ఏటుకూరులోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం భారత దేశ మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వాతంత్ర్య సమర యోధులు, సమతావాది జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి పలువురు నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



మహనీయునికి నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

మహనీయుల త్యాగాలను స్మరించుకోవాలి

- ఏఎన్‌యూ రిజిస్ట్రార్ సింహాచలం
- బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

ఏఎన్‌యూ: మహనీయుల త్యాగాలను స్మరించుకోవాలని ఏఎన్‌యూ రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బాబూ జగ్జీవన్‌రామ్ చైర్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ వర్ధంతి ఆదివారం నిర్వహించారు. చైర్ డైరెక్టర్ ఆచార్య పీజీ రత్నాకర్ అధ్యక్షత వహించారు. తొలుత ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సింహాచలం ప్రసంగిస్తూ మహనీయుల త్యాగాలతో మనం అనుభవిస్తున్న రిజర్వేషన్ల ఫలాలు కింది వర్గాలకు చేరువ చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. రిజర్వేషన్లు అనుభవించి అధిక లాభం పొందిన వారు వారి తరువాత వారి కోసం కొన్ని త్యాగాలు చేస్తేనే సార్థకత చేకూరుతుందని చెప్పారు. ప్రత్యేక అతిథిగా హాజరైన ఏపీ సెక్రటరియేట్ సెక్షన్ ఆఫీసర్, సెక్రటరియేట్ ఉద్యోగుల సంఘం నాయకుడు కత్తి రమేష్‌బాబు మాట్లాడుతూ భారత జాతి ఉన్నతికి బాబూ జగ్జీవన్‌రామ్ విలువైన సేవలు అందించారన్నారు. దూరవిద్యాకేంద్రం డైరెక్టర్ వి.వెంకటేశ్వర్లు, పూలే అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఎం.త్రిమూర్తిరావు, కమర్షియల్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ కె.వంజుబాబు, ఏఎన్‌యూ పరీక్షల విభాగం సీఈ ఎ.శివప్రసాదరావు, నోడల్ ఆఫీసర్ ఆర్.ప్రకాశరావు, జర్నలిజం విభాగం సహాయ ఆచార్యులు డాక్టర్ జె.మధుబాబు, ఉద్యోగ సంఘ నాయకులు టి.మోషే, కె.కనకరాజు, కె.జేమ్స్, పరిశోధక సంఘ నాయకులు బి.కోటి యాదవ్, వై.రాజేష్, పి.అభిషేక్, వై.రవికిరణ్, శాస్త్రి, సునీల్, ఎంఎస్ఎఫ్ అధ్యక్షుడు కె.ప్రపుల్ కుమార్ పాల్గొన్నారు.



బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న రిజిస్ట్రార్ సింహాచలం

28 శునకాలకు రేబిస్ టీకాలు



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని పశువైద్యశాలలో ఆదివారం ప్రపంచ జునోసిస్ డే సందర్భంగా పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్‌ను ఉచితంగా వేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి బి.సాల్మన్‌సింగ్ మాట్లాడుతూ ఈ టీకా ఏడాదికి ఓమారు వేయించాలని.. దానిద్వారా రేబిస్ వ్యాధి సో కకుండా ఉంటుందని.. రోగ నిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. కుక్క కాటు ద్వారా రేబిస్ వ్యాధి సోకుతుందని దీని ద్వారా ఒక్కోసారి ప్రాణాలు పోయే పరిస్థితి ఎదురవుతుందన్నారు. అనంతరం 28 కుక్కలకు రేబిస్ టీకాలు వేసారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.


ఆటోని ఢీకొట్టిన కారు

మందడం(తాడికొండ): ఆటోను కారు ఢీకొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న 5 మంది ప్రయాణికులు గాయాలపాలైన ఘటన తుళ్లూరు మండలం మందడం సీడ్ యాక్సిస్ రోడ్డుపై ఆదివారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. చిలకలూరిపేట పరిధిలోని మురికిపూడి గ్రామానికి చెందిన భక్తులు ఆటోలో తాళ్లాయపాలెం శైవక్షేత్రం, వెంకటపాలెం టీటీడీ ఆలయానికి వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో మందడం సీడ్ యాక్సిస్ రోడ్డు వద్ద వేగంగా వస్తున్న కారు ఆటోను ఢీకొట్టడంతో ఆటో కాల్వలో పడి ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులకు గాయాలయ్యాయి. స్థానికులు సపర్యలు చేసి 108 వాహనం ద్వారా విజయవాడ ప్రభుత్వ సుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఫిరంగిపురం: ఆటో బోల్తాపడి ఓ వ్యక్తి మృతి చెందగా మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాతులూరు గ్రామానికి చెందిన దాసరి శ్రీను(45) ఓ ప్రయివేటు పాఠశాలలో బస్సు క్లీనర్‌గా పని చేస్తున్నాడు. మేరికపూడి గ్రామంలోని దర్గా వద్దకు తన స్నేహితులతో కలిసి శనివారం రాత్రి భోజనానికి వెళ్లారు. అనంతరం తన స్నేహితులతో కలిసి తిరిగి అర్ధరాత్రి వస్తుండగా పొలిమేర వద్ద ఎదురుగా వచ్చిన వ్యాన్ ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తా పడగా ఆటో నడుపుతున్న శ్రీను మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని నరసరావుపేటకు తీసుకువెళ్లగా శ్రీను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శ్రీను భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైభవంగా తొలి ఏకాదశి పూజలు



చేబ్రోలు మండలంలోని గ్రామాల్లో ఆదివారం తొలి ఏకాదశి వేడుకలను భక్తులు వైభవంగా నిర్వహించారు. చేబ్రోలులో ఖ్యాతి గాంచిన చతుర్ముఖ బ్రహ్మ లింగేశ్వరస్వామి దేవస్థానంలో తొలి ఏకాదశి పూజలను ఘనంగా నిర్వహించారు. పర్వదినం సందర్భంగా స్వామి వారికి కనులపండువగా అభిషేకాలు చేశారు. పరిమళ పుష్పాలతో సుందరంగా మూర్తిని అలంకరించారు. పరిసర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామిని దర్శించి తరించారు.

– చేబ్రోలు

ఎయిమ్స్‌లో రోగుల పరిస్థితి దయనీయం

ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ ఉంటేనే చికిత్స!

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని ఆల్ ఇండియా మెడికల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ (ఎయిమ్స్)లో రోగుల పరిస్థితి ఘోరంగా మారిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ లేకుంటే వైద్య సేవలు, మందులు అందజేయమని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నటరాజన్ ఏఆర్ సర్క్యులర్ జారీ చేయడంపై రోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ ఉంటేనే చికిత్స, మందుల సరఫరా ఉంటుందని.. లేదంటే ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్స చేయించుకోవాలని సర్క్యులర్ మంజూరు కావడంపై రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఆసుపత్రిలో వివరణ కోరగా ప్రస్తుతం బీపీఎల్ కార్డు ఉన్న వారందరికీ ఉచితంగా చికిత్స, మందులు అందజేస్తున్నామని అన్నారు. ఢిల్లీ ఎయిమ్స్‌లో ఎలాంటి నిబంధనలు అమలులో ఉన్నాయో.. మంగళగిరి ఎయిమ్స్‌లోనూ అవే నిబంధనలు పాటిస్తున్నట్లు తెలిపారు. రోగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. అత్యధికంగా ఖర్చు అయ్యే చికిత్సతో పాటు మందులు కొనుగోలు చేసుకోవాలని బీపీఎల్ లేని వారికి సూచించడం జరుగుతుందన్నారు.

ఇచ్చిన హామీని మంత్రి లోకేష్ విస్మరించారు

తాడేపల్లి రూరల్: ఎన్నికలకు ముందు ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు ఇచ్చిన హామీని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ మరిచారని సీఐటీయూ తాడేపల్లి మండల కార్యదర్శి వేముల దుర్గారావు అన్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు ఆదివారంతో 215వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్‌తో కలిసి సందర్శించి కార్మికులకు మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల విషయంలో జోక్యం చేసుకుని వారికి రావాల్సిన బకాయిలను ఇప్పించాలని కోరుతున్నామన్నారు. మంత్రి లోకేష్ కార్మికుల సమస్యపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆశీర్వాదం, గురవయ్య, కార్మికులు సాంబయ్య, నాగేశ్వరరావు, సుబ్బారావు, ఇస్మాయిల్, నవనీతం తదితరులు పాల్గొన్నారు.



కార్మికులకు మద్దతు తెలియజేస్తున్న నాయకులు

ఘనంగా గంగానమ్మ జాతర



జాతరలో పాల్గొన్న భక్తులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బోసుబొమ్మ సెంటర్ వాటర్ ట్యాంక్ వద్ద గల గంగానమ్మ ఆలయంలో ఆదివారం గ్రామస్తులు, రైతులు అంగరంగ వైభవంగా శ్రీ గంగానమ్మ పోతురాజు, మహాలక్ష్మి కమిటీ ఆధ్వర్యంలో జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఏటా అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం వర్షాలు బాగా కురవాలని, రైతులకు పంటలు బాగా పండాలని ఈ వేడుకలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉదయం గంగానమ్మ అమ్మవారికి మంగళస్నానం, పసుపు కుంకుమ, నైవేద్యం సమర్పణ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జీవో నంబర్ 77 పీజీ విద్యార్థుల పాలిట శాపం



విద్యార్థులతో కలిసి నిరసన చేస్తున్న యశ్వంత్ రఘువీర్

ప్రత్తిపాడు: పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో నంబర్ 77ను వెంటనే రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్ రఘువీర్ అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడు బస్టాండు సెంటరులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) గుంటూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన యశ్వంత్ రఘువీర్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.6,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలన్నారు. వంద రోజుల్లోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేస్తామని యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన హామీని గద్దెనెక్కిన తరువాత విస్మరించారని మండిపడ్డారు. నామమాత్రంగా రూ.600 కోట్లు విడుదల చేసి చేతులు దులిపేసుకున్నారని దుయ్యబట్టారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించినప్పటికీ ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్తిపాడు నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు మైలా డేవిడ్, సుదర్శనం అమర్నాథ్ మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాకపోవడంతో యాజమాన్యాల ఒత్తిడితో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 11న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్‌ల ఎదుట ధర్నా నిర్వహించనున్నామని చెప్పారు. కార్యక్రమానికి విద్యార్థులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అజయ్, సాయిగణేష్, కిరణ్, సంతోష్, ప్రవీణ్, రాజా శేఖర్, యశ్వంత్, రాజేంద్ర, గణేష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీలో ప్రతిభ చాటిన విద్యార్థినికి సత్కారం

ప్రత్తిపాడు: ఐఐటీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వెలగా తేజోతన్మయను గ్రామస్తులు సత్కరించారు. పెదనందిపాడు మండలం వరగానికి చెందిన వెలగా రాఘవయ్యచౌదరి, శ్రీవల్లి దంపతుల కుమార్తె తేజోతన్మయ ఇటీవల విడుదలైన ఐఐటీ ఫలితాల్లో 490వ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా ఆదివారం వరగానిలోని తమ నివాసంలో తేజోతన్మయను గ్రామస్తులు, పెద్దలు అభినందించారు. దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఆల్‌ఇండియా స్థాయిలో 500 లోపు ర్యాంకు సాధించడం హర్షణీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని గ్రామపెద్దలు ఆకాంక్షించారు. కార్యక్రమంలో వెలగా రామారావు, ఉమామహేశ్వరరావు, యర్రం సుబ్బారావు, చెన్నుపాటి శివ నాగేశ్వరరావు, చెన్నుపాటి సురేంద్రబాబు, నూతి పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



తేజోతన్మయను దుశ్శాలువాతో సత్కరిస్తున్న గ్రామపెద్దలు, గ్రామస్తులు

భక్తి శ్రద్ధలతో మొహర్రం వేడుకలు

పొన్నూరు: మతసామరస్యానికి ప్రతీక అయిన మొహర్రం పండుగ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. హాజరత్ ఇమామే హసన్ హాజరత్ ఇమామే హుస్సేన్ వారి త్యాగాలను స్మరిస్తూ 9 రోజుల నుంచి నిర్వహిస్తున్న వేడుకల్లో భాగంగా పట్టణంలోని పీర్ల చావిడి వద్ద నుంచి చిన్న షరగతులు, పెద్ద షరగతులు గొప్ప ఊరేగింపుగా బయలుదేరి పాత పొన్నూరులోని కార్బల వద్దకు చేరాయి. అక్కడ ఫతేహ ఖాని చదివి భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఈ ఊరేగింపులో మహిళలు, యువకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మొల్లా ముజావర్ల కమిటీ మొల్లా కరీమ్, హైదర్, గబ్బర్ బాషా, సంధాని, నజీర్, షేక్ ఖాదర్, షేక్ మునవార్, మొల్లా నాజుముద్దీన్, ఖలీల్ బాషా, బాజి, షేక్ గౌస్, మొల్లా అఫ్రీద్, మొల్లా ఆర్షద్, జలీల్, ఇమ్రాన్, షేక్ రఫీ, షేక్ అమీన్ తదితరులు పాల్గొన్నారు.



పీర్ల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

గురు పూజకు శ్రీ కృష్ణుడిని ఆరాధించాలి

దుగ్గిరాల: ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు వారు రచించిన 101 త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాలు, భగవద్గీత ప్రచారాలను నిర్వహించారు. దుగ్గిరాల మండలంలోని చినపాలెంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక అధ్యక్షులు రౌతు శ్రీనివాసరావు మాట్లాడుతూ.. శ్రీ కృష్ణుడిని, భగవద్గీతని విశ్వసించడం వల్ల జ్ఞానం, మోక్షం లభిస్తాయని తెలిపారు. జులై 10వ తేదీన గురు పౌర్ణమి సందర్భంగా శ్రీ కృష్ణ భగవానుడిని ఆరాధించాలని తెలిపారు. కార్యక్రమంలో టి.వి.కృష్ణా రావు, ఆర్.రామకృష్ణ, బి.శివలింగం నాయక్, టి.బ్రహ్మం, బి.రామోజీ నాయక్, హరిబాబు, ఫణిదరం శివ, దిల్సా, మౌనిక తదితరులు పాల్గొన్నారు.



భగవద్గీత ప్రచారంలో పాల్గొన్న సభ్యులు

కార్మెల్‌మాత పవిత్ర జెండాల ప్రతిష్ట

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కార్మెల్ కొండపై గల కార్మెల్ మాత ఆలయంలో ఈ నెల 14, 15, 16 తేదీల్లో ఉత్సవాలు నిర్వహించనున్నట్లు బాల ఏసుదేవాలయ విచారణ గురువులు ఫాతిమా మర్రెడ్డి ఆదివారం తెలిపారు. ఉత్సవాల ఏర్పాట్లలో భాగంగా ప్రారంభ సూచికగా పవిత్ర జెండాలను బాల ఏసుదేవాలయంలో ఉంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మేళతాళాలతో ఊరేగింపుగా కార్మెల్ కొండ వరకు వచ్చారు. ఆలయ ప్రాంగణంలో ఉంచి ప్రత్యేక దివ్యపూజా, బలిపూజలు నిర్వహించి జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గురువులు, మఠకన్యాస్త్రీలు, గుడిపెద్దలు, కథోలిక క్రైస్తవులు పాల్గొన్నారు.



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న విచారణ గురువులు ఫాతిమా మర్రెడ్డి

కేంద్రంలో చంద్రబాబుది ప్రేక్షక పాత్ర

మంగళగిరి టౌన్: కేంద్రంలో చంద్రబాబు పాత్ర కేవలం ప్రేక్షక పాత్రే అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. మంగళగిరి నగర పరిధిలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం పార్టీ మహాసభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలో లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేశారే తప్పా.. ఎటువంటి అభివృద్ధి కనిపించడం లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఆదానీ, కార్పొరేట్ సంస్థలకు దాసోహం అవుతోందని ఆరోపించారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. మోదీ, అమిత్‌షా జోడీలు దేశ ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేస్తూ కార్పొరేట్‌లకు దాసోహం అవుతూ ఆర్థిక వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్, నాయకులు బాపనపల్లి వెంకటేశ్వరరావు, చిన్ని తిరుపతయ్య, కంచర్ల కాశయ్య, జాలాది జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ